ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 61 | ఆదివారం, 17 నవంబర్ 2024 | పేజీలు: 07 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



## లగచర్ల ఘటనలో మరో 8 మంది అరెస్ట్

- పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఇప్పటికే 17 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు
- కేసు దర్యాప్తు మరింత ముమ్మరం

2



మహారాష్ట్రలో ప్రజా తీర్పును కాలరాశారు

# శిండే.. అజిత్ గుజరాత్ గులాంలు

## చంద్రాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

### తెలంగాణలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం
- ఏడాదిలోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం
- మహారాష్ట్రలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**

శిండే.. అజిత్ పవార్ గుజరాత్ గులాంలుగా మారారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర చంద్రాపూర్ నియోజవర్గం గుగ్గూస్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. ఏడాది కాలంలో తెలంగాణలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని క్లారిటీ ఇచ్చారు. ఈ దేశంలో గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ ఏడాది కాలంలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మహారాష్ట్రలో ప్రజా తీర్పును ఏక్‌నాథ్ శిండే.. అజిత్ పవార్ కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిండే.. అజిత్ పవార్ గుజరాత్ గులాంలుగా మారారని కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రాపూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ పడ్ వేకర్ ను 50 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ ప్రవీణ్ ను గెలిపిస్తే మీకు ఇక్కడ ఒక అన్న ఉంటారు. హైదరాబాద్ లో మరో అన్నగా నేను ఉంటా అన్నారు. ఇక రేపు ఇక రెండోరోజు ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్ చేరుకుంటారు. నయగావ్, భోకర్, షోలాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ప్రచారం అనంతరం అక్కడి నుంచి మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు తెలుస్తుంది. ఈ నెల 20న జరగనున్న మిగతా 2లో..

## కేసీఆర్ సూచనతోనే కిషన్‌రెడ్డి అధ్యక్షుడయ్యారు


### కలెక్టర్ మీద దాడిని సమర్థించడం సరికాదు

- మూసీ వద్ద నిద్రలేచాక నిజాలు చెప్పాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచనతోనే కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని దక్కించుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్ సూచనతోనే మూసీ నిద్రకు సిద్ధమయ్యారని విమర్శించారు. కిషన్ రెడ్డి డీఎన్ఏ పరీక్ష చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. ఆయన అసలు తెలంగాణ బిడ్డేనా? తెలంగాణ బిల్లు మిగతా 2లో..



## గ్రూప్3 పరీక్షలకు సర్వం సిద్ధం

### నేడు రేపు జరగనున్న పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేసిన టీజీపీఎస్సీ
- అభ్యర్థులకు కీలక సూచనలు

2

## రేవంత్‌రెడ్డికి ఆ నలుగురే రక్షణ



- సీఎంను కంటికిరెప్పలా చూసుకుంటున్న బీజేపీ నేతలు
- బండి సంజయ్, రఘునందన్, విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అర్వింద్ రక్షణగా ఉంటున్నారు
- వీరు రేవంత్‌రెడ్డి పార్టీలో ఉన్నారా? బీజేపీలో ఉన్నారా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

# రేవంత్‌రెడ్డిది తుగ్లక్ పాలన

### ఆయనకు నడమంత్రాన ఈ పదవి వచ్చింది

- పేదల బ్రతుకుల్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తుండు
- ఏడాదిగా వారికి ప్రశాంతత లేకుండా చేశావు
- మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్
- మూసీ ఇండ్ల బాధితులకు రక్షణగా ఒక్కరోజు నిద్ర కార్యక్రమం

2





## ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు లగచర్ల బాధితుల ఫిర్యాదు

- గ్రామంలో పర్యటిస్తామని అసభ్యంగా ప్రవర్తించారు
- భూములు కోల్పోతున్న ప్రజలకు న్యాయం చేయాలి
- రైతుల ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాలి

2

## వచ్చే ఎన్నికల్లోగా బీఆర్ఎస్ చాప్టర్ క్లోజ్



- పదేండ్లు పాలించి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేదు
- తెలంగాణను అన్ని విధాలుగా దోచుకున్నరు
- గత ప్రభుత్వం కంటే మేము మెరుగైన పాలన అందిస్తున్నం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

2

## విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా?



- బాసర ట్రిపుల్ ఐటీలో ఏబీవీపీ నాయకులపై దాడి, అరెస్ట్‌లు దుర్మార్గం
- అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

2



## నల్గొండకు మేం వ్యతిరేకం కాదు

- అక్కడి రైతులకు బీజేపీ అండగా ఉంటుంది
- పేదల ఇల్లు కూల్చితే మూసీ ప్రక్షాళన జరగదు
- కంపెనీల కాలుష్యం రాకుండా అడ్డుకోవాలి
- కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ చీఫ్ కిషన్‌రెడ్డి
- అంబర్‌పేట తులసీరామ్‌నగర్‌లో మూసీ నిద్ర కార్యక్రమం

2



# లగచర్ల ఘటనలో మరో 8 మంది అరెస్ట్

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**

లగచర్లలో అధికారులపై దాడి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. తాజాగా మరో 8 మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరిని పరిగి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసులో ఇప్పటికే 17 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చర్లపల్లి జైలులో ఉన్నారు, మిగతా 16 మందిని పరిగి నుంచి సంగారెడ్డి జైలుకు తరలించారు. మరోవైపు లగచర్ల ఘటనపై వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీ మహేశ్ భగవత్ వివరాలు సేకరిస్తున్నారు. లగచర్లతో పాటు పరిసర గ్రామాల్లో పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.



# విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా?

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**

ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్తున్న ఏబీవీపీ నాయకులు అరెస్ట్‌లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఏబీవీపీ నాయకులపై పోలీసుల, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి న్యాయం చేయమంటే విచక్షణారహితంగా దాడి చేయిస్తారా? అని, బాసర ట్రిపుల్ లో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది? విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా.. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు? అని, విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు బండి సంజయ్. ట్రిపుల్ ఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న స్వాతిప్రియ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని బండి సంజయ్ అన్నారు. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని, ఇంకా జాప్యం చేయకుండా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

# శిండే.. అజిత్ గుజరాత్ గులాంలు

(మొదటి పేజీ తరువాయి)



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి, విపక్ష ఇండియా కూటమి గెలుపు కోసం శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ తరపున ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ప్రచారం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి తరపున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం చేస్తున్నారు. తెలుగువారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్డీయే నుంచి కేంద్రమంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రచారంలో సందడి చేశారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ముంబైలో బీజేపీ నేతలు తమ మిత్రపక్షం ఏపీ సీఎం చంద్రబాబు బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ప్రచారానికి ఆహ్వానించారు. ఈనేపథ్యంలో నేడు పవన్ కళ్యాణ్ ప్రచారం చేపట్టారు.

# రేవంత్‌రెడ్డికి ఆ నలుగురే రక్షణ

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**



రేవంత్‌రెడ్డికి ఎప్పుడు కష్టం వచ్చినా కేంద్రమంత్రి బండి సంజయ్ ముందు నిలబడతారని, రెప్పవాల్చకుండా... రక్షణగా ఉంటూ కాపాడుకుంటున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బండి సంజయ్ కేంద్ర సహాయమంత్రిగా కాకుండా రేవంత్ రెడ్డి సహాయమంత్రిగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డిని తిడితే... రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ వంటి బీజేపీ ఎంపీలకు కోపం వస్తోందని ఆరోపించారు. ఈ నలుగురు బీజేపీ నేతలు రేవంత్ రెడ్డికి రక్షణ కవచంగా ఉంటున్నారన్నారు. వీరు రేవంత్ రెడ్డి పార్టీలో ఉన్నారా? లేక బీజేపీలో ఉన్నారా? అని ప్రశ్నించారు. పలువురు కాంగ్రెస్ నేతలు ఈ రోజు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బఫర్ జోన్‌లో ఉన్నాయని ఇళ్లను కూలగొడుతున్నారని, మరి పెద్ద పెద్ద కంపెనీలకు అదే భూమి ఇచ్చి షాపింగ్ మాల్స్ కట్టుకోమని ఎందుకు చెబుతున్నట్టని సీఎంను నిలదీశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లలో నుంచి మురికి నీరు, మాల్స్ నుంచి సుగంధపు వాసన వస్తుందా? అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో దేవుళ్ల మీద కూడా ఒట్టేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నాయని, అందుకే ఎత్తైన కుర్చీలు వేసుకుని కూర్చుంటున్నారని, లేదంటే రెండు కుర్చీలు వేసుకుని కూర్చుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎత్తైన కుర్చీలో కూర్చుంటే పెద్దోడివి అయిపోవని చురకఅంటించారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవాలన్నారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంలో చూస్తే అదానీ దొంగ అని రాహుల్ గాంధీ అంటారని, కానీ అదే అదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేస్తున్నారని విమర్శించారు. అదానీ విషయంలో ఢిల్లీ కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తీరు వేరుగా ఉందన్నారు.

# నల్గొండకు మేం వ్యతిరేకం కాదు

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**



నల్గొండకు తాము వ్యతిరేకం కాదని, నల్గొండ రైతులకు బీజేపీ అండగా ఉంటుందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ చీఫ్ కిషన్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళనలో పేదల ఇళ్లు కూల్చడానికి వ్యతిరేకంగా శనివారం(నవంబర్ 16) అంబర్‌పేట తులసీరామ్‌నగర్‌లో మూసీ నిద్ర కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పేదల ఇళ్లు కూల్చితే మూసీ ప్రక్షాళన జరగదు. కంపెనీల కాలుష్యం రాకుండా అడ్డుకోవాలి. రివర్ బెడ్ ఎలా ఉంటుందో కూడా తెలియదు. కాలుష్యం కాకుండా ఏం చేయాలో తెలియదు. కృష్ణా నీళ్ళు తెస్తారా ? గోదావరి నీళ్ళు తెస్తారా ? ఏ విషయంలోనూ సీఎంకు క్లారిటీ లేదు. మూసీ సుందరీకరణ చేయాలి. మూసీ రిటైనింగ్ వాల్ కట్టండి. లక్షా యాభై వేల కోట్లకు అదనంగా నా జీతం ఇస్తా. అవసరం అయితే ఇంటింటికీ చందాలు వసూలు చేసి ఇస్తాం. నిజాంకు భయపడలేదు..నీకు భయపడతామా. బుల్డోజర్‌కు భయపడం.పేదలు సంతోషంగా ఇక్కడి నుంచి వెళ్తానంటే అడ్డుకోము. ఇళ్లు కూలగొట్టే పద్ధతి మంచిది కాదు. ఒక కేంద్ర మంత్రిగా..ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా చెబుతున్నా..ఇల్లు కూల్చే కార్యక్రమాన్ని విరమించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నా. వారం రోజులు ఇళ్ళల్లో పనిచేస్తే ఎంత జీతం వస్తుందో అంత మొత్తం మూసీ ప్రక్షాళనకు పేదలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడే భాష పద్ధతిగా లేదు.మూసీ పక్కన మట్టి పోస్తూ అక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి. వైఎస్సార్ ఉన్నప్పుడే ఇక్కడ రోడ్లు వేశాం.వైఎస్సార్ ఉన్నప్పుడే ఇక్కడ ఇంగ్లీష్ మీడియా స్కూల్ కట్టాం. వైఎస్సార్ ఉన్నప్పుడే అంబర్ పేటలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.పేద ప్రజలను రెచ్చగొట్టాలని లేదు. ముఖ్యమంత్రిని విమర్శించాలని లేదు. రాజకీయంగా చూడవద్దు.. ప్రజల తరపున.. ప్రజల కోసం.. ప్రజలు చేస్తున్న ఉద్యమం ఇది.ప్రజలు చేస్తున్న కార్యక్రమంలో బీజేపీ పాల్గొన్నది. ఎంత మందిని జైల్లో వేస్తావో.. ఎంత మందిని తొక్కిస్తావో చూద్దాం. ప్రతి అడ్డమైనవాడు విమర్శలు చేస్తున్నారు..ప్రజల కోసం భరిస్తాం'అని కిషన్‌రెడ్డి అన్నారు.

# రేవంత్‌రెడ్డిది తుగ్లక్ పాలన

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**



రేవంత్‌రెడ్డి తుగ్లక్ పరిపాలనలో పేదలకు హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్, ఉరివేసుకొని చనిపోయే పరిస్థితి వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ చేపట్టిన మూసీ ఇండ్ల బాధితులకు రక్షణగా ఒక్కరోజు నిద్ర కార్యక్రమంలో భాగంగా చైతన్యపురి డివిజన్ లోని ఫణిగిరి మారుతి నగర్ లో ఆయన నివాసితులతో సమావేశమై వారిని ఉద్దేశించి మాట్లాడారు. "రేవంత్ రెడ్డి నీకు నడమంత్రాన ఈ పదవి వచ్చింది. వాళ్ళ తప్పు చేస్తే వారిని ఓడగొట్టాలని కసితో నీకు ఓట్లు వేశారు. కానీ సంవత్సర కాలంగా ప్రశాంతత లేకుండా చేశావు. పేదల బ్రతుకుల్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తున్నావు". ముసలి కన్నీరు కారుస్తున్నావని విమర్శించారు. 'ఆయన ప్రేమ మూసీ పక్కన ఉన్న ప్రజల మీదనో, నల్గొండ ప్రజానీకం మీదనో కాదు ఆయన ప్రేమ బిల్డర్లకు భూములు కట్టబెట్టే ప్రేమగా అభివర్ణించారు. ఆయనకు కనిపిస్తుంది తెలంగాణ ప్రజలు కాదు. వేల కోట్ల రూపాయలు ఢిల్లీకి పంపించేందుకు తెలంగాణను దోచుకుని కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల కోసం డబ్బులు పంపిస్తూ తెలంగాణ ప్రజల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. మీరు పాదయాత్రలు చేసి రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే ప్రయత్నం చేస్తే కేసీఆర్ కి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడన్నారు. మొన్ననే డిపిఆర్ కి డబ్బులు విడుదల చేశాము డీపీఆర్ రావడానికి 18 నెలల టైం పడుతుందన్నావు మరి డిపిఆర్ తయారు కానప్పుడు ఏ ధైర్యంతో పనిగిరి కాలనీలో ఆర్ బి ఎక్స్ అని మార్కింగ్ చేశారని నిలదీశారు. మీరు పెట్టిన హింసకు తాళలేక లక్ష్మమ్మ అనే మహిళ హార్ట్ ఎటాక్ తో హాస్పిటల్ లో అడ్మిట్ అయిందని, నాగిరెడ్డి అనే వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందన్నారు. కూకట్పల్లి నల్లచెరువులో బుచ్చమ్మ అనే మహిళ పిల్లలకు పంచిన ఆస్తి పోతుందనే ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకుందన్నారు. కెమికల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు, డ్రైనేజీ కలిసి మూసీ కంపుగా తయారయిందని ముందు అవి రాకుండా చేయాలి కదా అవి చేయకుండా ఇళ్లను కూలగొట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ ముఖ్యమంత్రికి ఏం పిచ్చి పట్టింది మా వెంట ఎందుకు పడుతున్నారని ప్రజలు అనుకుంటున్నారని, చైతన్యపురికో, రామంతపూర్ కి రావడానికి రేవంత్ రెడ్డికి ముఖం లేదని నల్గొండ వెళ్లి అక్కడ ప్రజల్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. ఉద్యోగులకు జీతాలు లేవు, మధ్యాహ్న భోజనానికి డబ్బులు లేవు కానీ లక్షన్నర కోట్లు ఎక్కడివి.. ఈ మతలబు ఏంటన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే దమ్ము లేదు కాబట్టి వాటిని పక్కదోవ పట్టించడానికి మూసీ ప్రక్షాళన తెరమీదకు తెచ్చారని పేర్కొన్నారు.

# కేసీఆర్ సూచనతోనే కిషన్‌రెడ్డి అధ్యక్షుడయ్యారు

(మొదటి పేజీ తరువాయి)



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సూచనతోనే కిషన్ రెడ్డి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని దక్కించుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు చేశారు. కేసీఆర్ సూచనతోనే మూసీ నిద్రకు సిద్ధమయ్యారని విమర్శించారు. కిషన్ రెడ్డి డీఎన్ఏ పరీక్ష చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. ఆయన అసలు తెలంగాణ బిడ్డేనా? తెలంగాణ బిల్లు ఎలా పాస్ అయిందో మీకు తెలియదా? కలెక్టర్‌ను కొట్టిన వారిని సమర్థిస్తున్న మీరు కేంద్రమంత్రి పదవికి అర్హులేనా? అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కలెక్టర్‌పై దాడి ఘటనను సమర్థించడమేమిటని ప్రశ్నించారు. ఈ దాడి ఘటనపై బీజేపీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ఎంపీగా, కేంద్రమంత్రిగా ఏం చేశారో చెప్పాలన్నారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో శనివారం బీజేపీ చేస్తున్న 'మూసీ నిద్ర'పైనా పొన్నం ప్రభాకర్ స్పందించారు. బీజేపీ నేతలు మూసీ వద్ద రేపు నిద్రలేచిన తర్వాత అక్కడి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని సూచించారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు మొద్దు నిద్ర నుంచి లేవాలన్నారు. నిధులు తేలేని బీజేపీ నేతలు మూసీ వద్దకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. మూసీ కాల్వ వాసన చూసిన తర్వాత అయినా వారు దైవసాక్షిగా నిజాలు చెబుతారని భావిస్తున్నానన్నారు.

# వచ్చే ఎన్నికల్లోగా బీఆర్‌ఎస్ చాప్టర్ క్లోజ్

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**



బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేకపోయిందని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. పదేళ్లలో తెలంగాణలో అభివృద్ధి జరగలేదని, కేవలం దోపిడీనే జరిగిందన్నారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన పాలనను అందిస్తున్నామన్నారు. ఈ మేరకు హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించడంలో భారాస పూర్తిగా విఫలమైంది. అధికారం కోల్పోయామనే అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి భారాస ఉండదు. పదేళ్లలో భారాస ఇచ్చిన ఉద్యోగాల కన్నా ఏడాది వ్యవధిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కువ. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. మిగతా రాష్ట్రాల్లోనూ తెలంగాణ తరహా పథకాలు కావాలని అడుగుతున్నారు. కులగణనతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. సంక్షేమం, అభివృద్ధిలో భారాస నేతలతో చర్చకు సిద్ధం. అన్ని రకాలుగా ప్రజలను మెప్పించాం. అందుకే విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. వరంగల్ విజయోత్సవ సభకు 'ఇందిరా మహిళా శక్తి సభ'గా నామకరణం చేశాం'' అని తెలిపారు.



# ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు లగచర్ల బాధితుల ఫిర్యాదు

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను లగచర్ల దాడి కేసు బాధితలు శనివారం కలిశారు. పోలీసుల దాడిపై కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమ పట్ల దౌర్జన్యకరంగా ప్రవర్తించారని బాధితులు ఫిర్యాదు చేశారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ, ఫార్మా కంపెనీకి మేం వ్యతిరేకం కాదన్నారు. రైతుల ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కలెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నామని తెలిపారు. త్వరలో లగచర్ల గ్రామంలో పర్యటిస్తామని అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను విచారిస్తామని కమిషన్ చైర్మన్ తెలిపారు. దోషులను కమిషన్ వదిలిపెట్టదని.. ఎస్సీ ఎస్టీలకు అండగా ఉంటుందని తెలిపారు. భూములు కోల్పోతున్న ప్రజలకు న్యాయం చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, కలెక్టర్‌పై దాడి కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. లగచర్ల దాడి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు సంబంధించి మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. అలాగే, పలువురు లగచర్ల గ్రామస్థులను అదుపులోకి తీసుకుని పరిగి పీఎస్‌కు తరలించారు. ఎనిమిది మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిని కోర్టులో హాజరుపరచనున్నారు.

# గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

**ప్రజాస్వరం ప్రతినిధి, హైదరాబాద్:**



తెలంగాణలో గ్రూప్3 పరీక్షలకు టీజీపీఎస్సీ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అభ్యర్థులకు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 102 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు. ఒరిజినల్ ఐడీతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 9.30కి ప్రారంభమయ్యే పేపర్1కు అభ్యర్థులు 8.30 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం పరీక్షలకు 1.30 గంటలలోగా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఉదయం జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇప్పటికే టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలని తెలిపింది. తొలిరోజు పేపర్1 పరీక్షకు తీసుకొచ్చిన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. నియామక ప్రక్రియ ముగిసేవరకు ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను భద్రంగా పెట్టుకోవాలని కమిషన్ సూచించింది.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక





**తూప్రాన్, నవంబర్16, ప్రజాస్వరం :**


రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజల నుంచి అనూహ్యస్పందన వస్తుంది. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే వేగంగా జరుగుతోంది. తూప్రాన్ డివిజన్ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, మాసాయిపేట, వెల్దుర్తి, చేగుంట మండలాల్లో సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకునేందుకు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డితో ప్రజాస్వరం ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ.



# చకచకా.. సమగ్ర సర్వే

## తూప్రాన్ డివిజన్ పరిధిలో 60శాతం సర్వే పూర్తి

## ప్రజాస్వరం ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆర్డీవో జయచంద్రారెడ్డి




**ప్రజాస్వరం ప్రశ్న :** తూప్రాన్ డివిజన్ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే ఎలా కొనసాగుతోంది.

**సమాధానం :** తూప్రాన్ డివిజన్ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, మాసాయి పేట, వెల్దుర్తి, చేగుంట మండలాల్లో సమగ్ర కుటుంబ సర్వేకు మంచి స్పందన లభిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వేను పూర్తి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నాం.

**ప్రజాస్వరం ప్రశ్న :** ఇప్పటివరకు తూప్రాన్ డివిజన్ పరిధిలో ఎంత మేర సర్వే పూర్తయింది..

**సమాధానం :** డివిజన్ లోని అన్ని మండలాల వారిగా సేకరించిన సమాచారం మేరకు సగటున తూప్రాన్ డివిజన్ పరిధిలో 60 శాతం మేర సర్వే పూర్తయింది.

**ప్రజాస్వరం ప్రశ్న:** తూప్రాన్ డివిజన్ పరిధిలో ఎంతమంది అధికారులు సిబ్బంది సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొంటున్నారు.

**సమాధానం :** తూప్రాన్ డివిజన్ లోని ఐదు మండలాల పరిధిలో 43 మంది సూపర్వైజర్లు 374 మంది ఎన్యుమరేటర్లు సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొంటున్నారు.

**ప్రజాస్వరం ప్రశ్న :** సమగ్ర కుటుంబ సర్వే కు ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది.

**సమాధానం :** సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది. అధికారులు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు ప్రతి కుటుంబంలోని సభ్యులందరూ తమ వివరాలను సిద్ధంగా ఉంచుకొని ఎన్యుమరేటర్లు వెళ్లగానే వారికి పూర్తి వివరాలు తెలియజేస్తున్నారు. తూప్రాన్ డివిజన్ లో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు సమస్యలు తలెత్తలేదు.

**ప్రజాస్వరం ప్రశ్న:** సర్వేలో అధికారులకు సిబ్బందికి ఏమైనా ప్రోత్సాహకాలు ఉన్నాయా

**సమాధానం:** సమగ్ర కుటుంబ సర్వేలో గడువులోపు 100శాతం సర్వే పూర్తి చేసిన ఎన్యూమరేటర్లకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేయాలనుకుంటున్నాం.

**ప్రజాస్వరం ప్రశ్న :** సర్వే పత్రాలు ఆన్లైన్ చేయడం ఎలా సాగుతోంది

**సమాధానం:** ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి తీసుకొచ్చిన సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సూచనలు మేరకు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. అన్ని మండల పరిధిలో ప్రత్యేకంగా కంప్యూటర్లను తాత్కాలిక సిబ్బంది నియమించి డాటా ఎంట్రీ చేపడుతున్నాం.








## పాలాటలో ఉచిత వైద్య శిబిరం

**తూప్రాన్, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

మనోహరాబాద్ మండలం పాలాట గ్రామంలో శనివారం నీలం సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మెడిసిటీ హాస్పిటల్ కు సంబంధించిన డాక్టర్ల ద్వారా పాలాట గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మనోహరాబాద్ ఎంపీవో నర్సింహులు, సెక్రెటరీ గీత, నీలం విజయ్, శ్రీనివాస్, వెంకటేష్, బాబు పాల్గొన్నారు.

## పౌరాణిక పోటీల్లో గీతా స్కూల్ స్టూడెంట్స్ ప్రతిభ



**తూప్రాన్, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

గత నెలలో సాహితీ జిగీష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక పోటీలలో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థినిలు అక్షర, సహస్రలు, రామాయణం మహాభారతం, భాగవత పురాణాల్లో రాష్ట్రంలో రెండవ బహుమతి పొందారు. హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరిగిన బహుమతి ప్రథమ కార్యక్రమంలో వీరికి సినీ దర్శకులు లక్ష్మణ రేఖ గోపాలకృష్ణ బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గీతా స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్ పర్సన్ ఉష, డైరెక్టర్లు రాఘవేంద్ర గౌడ్, నారాయణ గుప్తా, ప్రిన్సిపల్ వెంకటకృష్ణారావులు అభినందించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ప్రేమ్ రాజ్, రాజేశ్వర్లు ఉన్నారు.

## ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

**తూప్రాన్, నవంబర్, 16 (ప్రజాస్వరం) :**



జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా తూప్రాన్ దుర్గా మాత రియల్ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో రాం చంద్రం గుప్త, బుడ్డ భాగ్యరాజ్ విలేకరులకు శాలువాతో సత్కరించి జాతీయ పత్రికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా మిత్రులు అహర్నిశలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని గుర్తు చేశారు. పత్రికా రంగం సమాజానికి అద్దంగా నిలుస్తుందని నిష్పక్షపాతంగా, ధైర్యంగా, నిజాయితీతో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయుల కృషి ఎనలేనిది అని అన్నారు.పలు సామాజిక అంశాలను సమన్వయంతో ప్రజలకు అందించి, సమాజం చైతన్యవంతం కావడానికి సహాయపడుతున్న పాత్రికేయులో కృషి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అప్సర్, రమేష్, యాదగిరి, బలరాం రెడ్డి, విలేకరులు జానకిరామ్, భాస్కర్, అశోక్, రవీందర్, రాజశేఖర్, సందీప్ తదితరులున్నారు

## రైస్ మిల్లును తనిఖీ చేసిన ఎస్పీ

**నార్సింగి, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

వరి ధాన్యం తీసుకు వచ్చిన లారీలను త్వరగా ఖాళీ చేసి పంపాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని హనుమాన్ రైస్ మిల్లును శనివారం రామాయంపేట సీఐ వెంకట్ రాజు గౌడ్, నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహియుద్దీన్ తో పాటు ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. రైస్ మిల్లుల్లో పూర్తి సామర్థ్యం మేరకు వడ్లను తీసుకోవాలని, అన్లోడింగ్ త్వరగా జరిగేలా చూడాలని, అవసరం అయితే హమలిలను పెంచుకోవాలని ఆయన సూచించారు. లోడ్ అయి వచ్చిన లారీలను త్వరగా ఖాళీ చేసి తిరిగి పంపించాలని తద్వారా వడ్ల కొనుగోలు వేగవంతం అవుతుందని సూచించారు.



## సాయిబాబా ఆలయంలో
# లక్ష దీపోత్సవం
### ముఖ్యతిథిగా హాజరైన యాక్టర్ జబర్దస్త్ రఘు



**మేడ్చల్, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

మున్సిపాలిటీ పరిధిలోని సాయి బాబా దేవాలయంలో లక్ష దిపోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు బాలు యాదవ్ పిలుపు మేరకు ముఖ్య అతిథిగా యాక్టర్ జబర్దస్ రఘు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.జబర్దస్త్ రఘుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువతో సన్మానించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష దీపారాధన ను ఆలయ అర్చకులు చంద్రమౌళి పూజ కార్యక్రమంతో ప్రారంభించి దీపారాధన చేశారు.అనంతరం భక్తులు దీపాలను వెలిగించారు.ఈ సందర్భంగా యాక్టర్ జబర్దస్త్ రఘు మాట్లాడుతూ బాలు యాదవ్ మరియు ఆలయ కమిటీ సభ్యుల పిలుపు మేరకు కార్తీక పౌర్ణమి రోజున మేడ్చల్ లోని సాయి బాబా ఆలయంలో నిర్వహించే లక్ష దిపోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఆ యొక్క సాయి బాబా ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటునట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయంలో ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ ధాత్రిక సింహం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఐ సుధీర్ కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, నారాయణ, సాంబమూర్తి, దివాకర్, అర్చకులు మనోజ్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన
# మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



**కీసర, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లి 3వ వార్డులోని సుచిత్ర కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.15.00 లక్షలతో చేపట్టుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి పనులను చైర్ పర్సన్ కౌకుట్ల చంద్రారెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేశ్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ గోక కళావతి యాదగిరి , కాలనీ అధ్యక్షుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఆర్ఎస్‌పై టౌన్ ప్లానింగ్ సిబ్బందితో
# సమావేశం

**కీసర, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

నాగారం మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి ఎల్ఆర్ఎస్‌పై టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ గురించి మాట్లాడుతూ ధరఖాస్తులు పరిశీలించి, ప్రక్రియ వేగవంతం చేయుటకు తగు సూచనలు మరియు సలహాలు ఇస్తూ, డిసెంబర్ మాసము లోపు పూర్తి చేయుటకు ఆదేశాలు జారీ చేయనైనది. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి గీత కార్మికుడికి మోపెడ్ లు
# ప్రభుత్వం పంపిణీ చేయాలి

- తాడిచెట్టుపై నుండి పడి మృతి చెందిన కుటుంబాలకు 10లక్షలు ఇవ్వాలి..
- కాటమయ్య రక్షణ కవచం కిట్లను జాగ్రత్తగా వాడాలి..
- విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాస్వరం ప్రతినిధి, చిగురుమామిడి:**

అర్హులైన ప్రతి గీత కార్మికుడికి మోపెడ్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో పడాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క కల్లుగీత కార్మికుడికి కాటమయ్య రక్షణ కవచం కిట్లు అందజేయాలని కోరారు.అన్ని గ్రామాల్లోని కల్లుగీత కార్మికులను గుర్తించి కాటమయ్య రక్షణ కవచం కిట్ల పంపిణీలో జాప్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన అందజేయాలని వారు కోరారు. అన్ని గ్రామాల్లో కాటమయ్య రక్షణ కవచం వాడే పద్ధతి పై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.తాడిచెట్టు పై నుండి పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన కల్లుగీత కార్మికులకు 10లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో చాలామంది భాదిత కుటుంబాలకు ఎక్స్గ్రేషియా అందలేదని వెంటనే పాత బకాయిలను విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను సర్వే చేసి అందులో తాటి ఈత వనాలను ఏర్పాటు చేయాలని, అందుకు బోర్లు వేసేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని శ్రీనివాస్ కోరారు. కాటమయ్య రక్షణ కవచాల కిట్లను తీసుకున్న కల్లుగీత కార్మికులు అందరూ వినియోగించాలని ఎవరు నిర్లక్ష్యంగా వదిలివేయవద్దని శ్రీనివాస్ చెప్పారు.



## ఘనంగా సీతారామంజనేయస్వామి
# ఆలయ వార్షికోత్సవం

**కీసర, నవంబర్16 (ప్రజా స్వరం) :**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి శ్రీ సీతారామంజనేయ దేవాలయ 17 వ వార్షికోత్సవ పూజలు సందర్భంగా శనివారం గ్రామ పురోహితులు, ఘణపురం రాంప్రసాద్ శర్మ , ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ అనంతరం భక్తులకు టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మేడ్చల్ జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ డైరెక్టర్ గండి అంజయ్య గౌడ్ ,రాంపల్లి రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు వరాకల పెంటయ్య గౌడ్, నాగారం బిజెపి యువ నాయకుడు రామారం గిరి గౌడ్ లచే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీ సీతారాముల వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ వార్షికోత్సవ పూజ కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల సరిత రమేష్, ఎలిజాల నాగేష్ గౌడ్ , గోక కళావతి యాదగిరి, లక్ష్మీ వేణు , కో ఆప్షన్ సభ్యులు క్యాసారం అశోక్ గౌడ్, సీతారామంజనేయ దేవాలయ కమిటీ చైర్మన్ అధ్యక్షుడు రామారం నర్సింహ్మా గౌడ్ , ఉపాధ్యక్షుడు ఎలసాని నర్సింహ్మా యాదవ్ , ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్ చారి, కోశాధికారిగా గండి పల్లి మదన్ , కార్యవర్గ , పొట్ట సుధాకర్ , కొండేటి లక్ష్మారెడ్డి (చిన్న), మాడిశెట్టి నర్సింగ్ , రామాలయం శాశ్వత అన్నదాతలు డాక్టర్ విజయలక్ష్మి , సత్యనారాయణ , మరియు గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు, యువజన సంఘాల యువకులు ,గ్రామస్తులు ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**ప్రజాస్వరం ప్రతినిధి, బెజ్జంకి:**

బెజ్జంకి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ కొనుగోలు సరళిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.కొనుగోళ్ళను వేగవంతం చేయాలని,కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు వచ్చిన రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధరను పొందలన్నారు.కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయిలేని శ్రీనివాస్ రెడ్డి తన స్వగృహంలో సత్యనారాయణ వ్రతం చేపట్టగా, పూజలో పాల్గొన్నారు.వీరితో మార్కెట్ చైర్మన్ పులిక్రిష్ణ,డిప్యూటీ డైరెక్టర్ అఫ్ మార్కెటింగ్ ప్రసాద్ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెటింగ్ సెక్రటరీ వెంకటయ్య,ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి,నాయకులు చెప్యాల శ్రీనివాస్ గౌడ్,అక్కరవేణి పోచయ్య,ఏఎంసి డైరెక్టర్లు పుల్ల పోచయ్య,మచ్చ కుమార్ గారు,బండిపెల్లి రాజు,ఎర్రల రాజు, లింగాల శ్రీనివాస్,జెల్ల ప్రభాకర్,బోనగం రమేష్,శానాగొండ శరత్,అమరాజు నవీన్, తదితరులు పాల్గొన్నారు

## డీసీసీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు కుటుంబాలకు
# వెలిచాల రాజేందర్ రావు పరామర్శ

**ప్రజాస్వరం ప్రతినిధి, కరీంనగర్:**



కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు కే హనుమంతరావు అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు శనివారం పరామర్శించారు. కరీంనగర్ లోని హనుమంతరావు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను రాజేందర్ రావు పరామర్శించారు. హనుమంతరావు మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హనుమంతరావు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారని రాజేందర్ రావు పేర్కొన్నారు. ఎంతో మంచి పేరు సంపాదించారని కొనియాడారు. నాయకులు, కార్యకర్తలు పట్ల ఆయన ఎంతో అభిమానం చూపించేవారని గుర్తు చేశారు.

అలాగే కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ లో సీనియర్ జర్నలిస్టు, వీ6 వెలుగు నెట్వర్క్ ఇన్చార్జి, బ్యూరో చీఫ్ చిల్ల మల్లేశంను వెలిచాల రాజేందర్ రావు పరామర్శించారు. మల్లేశం తండ్రి లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాజేందర్ రావు అల్గునూర్ లోని వారి నివాసానికి వెళ్లి చిల్ల మల్లేశంను పరామర్శించారు. లక్ష్మయ్య మృతి గల కారణాలను మల్లేశంను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మయ్య మృతదేహం వద్ద వెలిచాల రాజేందర్ రావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు నివాళులర్పించారు. రాజేందర్ రావ్ వెంట కాంగ్రెస్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, గోపు మల్లారెడ్డి, కాల్వ మల్లేశం, కంది లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఈ20న ముఖ్యమంత్రి పర్యటన అడ్డుకుంటాం

### ఉమ్మడిజిల్లా తాజా మాజీ సర్పంచుల జేఏసీ

**ప్రజాస్వరం, కరీంనగర్ :**



సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని,ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల తాజా మాజీ సర్పంచులు అందరూ కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్న, సర్పంచులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిన నేటికి సర్పంచ్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరం,శాంతియుతంగా చేస్తున్నటువంటి మా సర్పంచుల ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూస్తూ, సర్పంచులపై కక్ష్య సాధింపు చేస్తుంది. కాబట్టి ఉమ్మడి కరీంనగర్ సర్పంచులు అందరూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని,ఈనెల 25వ తారీకు సోమవారం రోజున కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించడం జరిగింది.సర్పంచ్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలో పర్యటించాలని, లేనిపక్షంలో 20వ తారీకు సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తాజా మాజీ జేఏసీ సర్పంచులు అక్కెనపెల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య, పంజాల జగన్మోహన్ గౌడ్, శ్రీ మల్ల మేఘరాజ్, జోగు సాగర్, శ్రీనివాస్, గంప వెంకన్న, కే దామోదర్ రెడ్డి, గుంటుకు లచ్చన్న, లింగంపల్లి కరుణాకర్, మొగిలి సమ్మయ్య, లేచినేని నవీన్ రావు, రెడ్ల శ్రీనివాస్, వేముల దామోదర్, శ్రీనివాస్, గౌతం, ధర్మ రెడ్డి, మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా తదితర సర్పంచులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ లక్ష్మీపూర్ గ్రామశాఖ కార్యవర్గం ఎన్నిక

**ప్రజాస్వరం ప్రతినిధి, బెజ్జంకి:**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకఅధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ,మండల,జిల్లా కమిటీల నిర్మాణంలో భాగంగా లక్ష్మీపూర్ గ్రామంలో మండల ఇంచార్జ్ చింతకింది పర్శరాములు ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ని ఏర్పాటు చేశారు. గ్రామశాఖ అధ్యక్షులు గా బోనగిరి మల్లేశం,ఉపాధ్యక్షులు బోనగిరి శంకర్,తాడిచేట్టురాజయ్య,ప్రధాన కార్యదర్శి బోనగిరి ప్రభాకర్,కార్యదర్శి లింగాల శ్రీకాంత్,ప్రచార కార్యదర్శి బోనగిరి దినేష్,కోశాధికారి బోనగిరి శంకర్,కార్యవర్గ సభ్యులు బోనగిరి తిరుపతి,సురేష్,లక్ష్మయ్య,శంకరయ్య,దుర్గయ్య, పెద్దోళ్ల రాజయ్య,తడిచేట్టు. కొమురయ్య,సలహాదారులు మాంకాల శంకర్,బోనగిరి లక్ష్మయ్య లను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు.చింతకింది పర్శరాములు మాట్లాడుతూ మనజాతి హక్కులకై వర్గీకరణ అమలు ఐయేంతవరకు ప్రభుత్వం పై మనం అందరం మందకృష్ణ మాదిగ కు మద్దత్తు గా నిలబడి మరో పోరాటం కు సిద్ధం కావాలని,మన అందరి బాధ్యత తెలిపారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల సీనియర్ నాయకులు వడ్లూరి పర్శరాములు,మాజీ సర్పంచ్ మాంకాల బాలయ్య,బోనగిరి ఆనంద్,తాడిచెట్టు భూమయ్య,బెజ్జంకి శంకర్, బర్ల శంకర్,నాయకులు బోనగిరి తిరుపతి, బోనగిరి మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# అందరు చదవాలి అందరు ఎదగాలి

**ప్రజాస్వరం ప్రతినిధి, తిమ్మాపూర్:**




తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ లోని జిల్లా పరిషత్ హైస్కూల్ ను శనివారం రోజున ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారియొక్క పరిస్థితులు తెలుసుకుంటూ పాఠశాల యొక్క ప్రాముఖ్యతను చదువు యొక్క ఉపయోగం వివరిస్తూ అందరు చదవాలి అందరు ఎదగాలి అని తెలిపారు చదువు పట్ల ప్రతి విద్యార్థికి అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు అనంతరం గ్రామ యువకులకు పాఠశాల విద్యార్థుల కోరిక మేరకు పాఠశాల క్రీడ మైదానాన్ని పరిశీలించారు క్రీడాకారులకు పూర్తి స్థాయిలో క్రీడా మైదానాన్ని బాగు చేసి అన్ని క్రీడా సదుపాయాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తాను అని తెలిపారు ఈ కార్యక్రమంలో మడలాద్యక్షుడు మొరేపల్లి రమణారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు,గంకిడి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**మెదక్, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

తెలంగాణ పారా మెడికల్ బోర్డు సెక్రటరీ నోటిఫికేషన్ అనుగుణంగా మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024 25 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లమా ఇన్ అనస్తీసియా టెక్నీషియన్ కోర్సులకు ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్ శనివారంఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల సమర్పన కు ఈ నెల 20 న చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ వైద్య కళాశాల మెదక్ నందు సంప్రదించాలని ఆయన కోరారు.

# గ్రూప్ 3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్
- సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జస్ అనుమతి లేదు
- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

జిల్లా లో గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో గ్రూప్ ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, అబ్జర్వర్స్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్స్ కు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరయ్యారు. మెదక్ డిగ్రీ కాలేజ్ గ్రూప్ 03 ఎగ్జామ్ ఎగ్జామ్ హాల్ సీసీ కెమెరాలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షలను సమన్వయంతో, సజావుగా నిర్వహించాలని , ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా సమన్వయంతో ఈ నెల 17,18 తేదీలలో నిర్వహించే గ్రూప్ 3 పరీక్షలను సజావుగా నిర్వహించాలని తెలిపారు.19 పరీక్షా కేంద్రాలకు గాను 16 లొకేషన్స్ ఏర్పాటు చేసినట్లు మెదక్ సబ్ డివిజన్ 12 పరీక్షా కేంద్రాలు నిర్వహించగా, తూప్రాన్ సబ్ డివిజన్లో 07 సెంటర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధన ప్రకారం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలని, విమర్శలకు తావివ్వకుండా అభ్యర్థులను పరీక్ష హాలులోకి తనిఖీ చేసి పంపించాలని తెలిపారు. అభ్యర్థుల అటెండెన్స్ ఆరోపణలకు తావివ్వకుండా చూడాలని తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్, ఆన్లైన్ అటెండెన్స్ లో వ్యత్యాసం రాకుండా నిర్వహించాలని అన్నారు. అభ్యర్థుల వెంట సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జస్ లను పరీక్ష కేంద్రాలకు తీసుక రాకూడదని తెలిపారు. ప్రతీ సెంటర్ ముందు సెంటర్ పేరు, సెంటర్ కోడ్, లు తెలిపే విధంగా ఫ్లెక్సీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో త్రాగునీరు, మెడికల్ కిట్ తో పాటు వైద్య సిబ్బంది ఏర్పాటు చేయాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా ఏర్పాటు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల బయో మెట్రిక్ అటెండెన్స్ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2 గంటలకు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజ్ గౌడ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు





## విద్యార్థులు, దివ్యాంగులు ఆర్టీసీని సద్వినియోగం చేసుకోవాలి

**దౌల్తాబాద్, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

ఆర్టీసీ వికలాంగులకు, విద్యార్థులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పిస్తుందని,ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఆర్టీసి ప్రయాణం సురక్షితంగా ఉంటుందని విలేజ్ బస్ అధికారులు ఆర్ పీరెడ్డి, జయేందర్ రెడ్డిలు అన్నారు. శనివారం రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆధ్వర్యంలో వికలాంగులకు ఆర్టీసీ రాయితీపై బస్సు పాసులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని గుర్తు చేశారు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లకుండా ప్రజలు ఆర్టీసీని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ సమస్త ప్రజలకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని. ముఖ్యంగా వికలాంగులకు, విద్యార్థులకు ఉచిత బస్ పాస్ లు అందిస్తుంది. మహిళలకు ఉచిత ప్రయాణంతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ వివిధ రూట్లలో బస్సులను నడిపిస్తుందని, దీనితో ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రైవేట్ వాహనాలకు ఆశ్రయించకుండా ప్రజలందరూ ఆర్టీసీ బస్సులను ఆదరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ కిరణ్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మూసీ నివాసితులు గుబులులో ఉన్నారు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

మూసీ నివాసితులు దయనీయమైన గుబులులో ఉన్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఎంతో ఆందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నమని తెలియజేస్తున్నారు. కూలీ నాలి చేసుకుంటూ 40 ఏళ్ల నుంచి ఇక్కడే నివసిస్తున్నారు. వారి ఆవేదన వినడమే కాకుండా వారికి భారతీయ జనతా పార్టీ తరపున భరోసా కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ బస్తీ నిద్ర చేపట్టిందన్నారు. నిజంగా మూసి ప్రక్షాళన చేయాలంటే.. అందుకు అనేకమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి.. డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మార్చి.. దానికి కావాల్సిన నిధులు కేటాయించండి.. ఆ రకంగా చేయకుండా మూసీ పరివాహక ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు.. ఈ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కూడా కాలేదు.. ప్రజల మీద ఎందుకీ ప్రతాపం?.. పేదలు చేసిన పాపం ఏంటి..? అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. అలాగే, 150 మీటర్ల దూరంలో ఉన్న ఇండ్లకు మార్కింగ్ చేయడం ఏంటి? అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ క్వశ్చన్ చేశారు. ప్రభుత్వానికి చెప్పినా చెవిటి వాడి ముందు శంఖం ఉదినట్లు వ్యవహరిస్తున్నారు.. దున్నపోతు నిద్రలో ఉన్నట్లు ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుంది.. కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది.. మూసి ప్రక్షాళన పేరు మీద 150 కోట్లతో అవసరమా అని ప్రశ్నిస్తున్నా.. మూసి నిద్ర పేరు మీద ఒక్క రోజు కార్యక్రమం కాదు.. ఇది బీజేపీ తరపున ఒక హెచ్చరిక మాత్రమే అని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి బీజేపీ నాయకులంతా కదం తొక్కారు.. ప్రభుత్వం ఇప్పటికైనా అప్రమత్తం అవ్వాలి.. పేదల జీవితాలతో చెలగాటం ఆడితే.. బుల్డోజర్లకు అడ్డం నిలబడైనా వారికి న్యాయం చేయడానికి మేము ఉన్నాం.. అర్ధాంతరంగా ఇండ్లు తొలగిస్తామని ఇక పక్ష నిర్ణయం తీసుకుంటూ ముందుకు వెళ్తే.. మీ ప్రభుత్వం తీవ్ర మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు.



## అనాథ పిల్లలకు అండగా బీజేపీ

**దౌల్తాబాద్, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

గతంలో ఆర్థిక సమస్యలతో తండ్రి మైసని గోపాల్, ఇటీవల అనారోగ్యంతో తల్లి మైసని నాగమణి ఇద్దరు మృతి చెందడంతో చిన్నారులు ఇద్దరు అనాధలయ్యారు. వారికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆదేశాల మేరకు ఆర్థికసాయం చేశామని బీజేపీ నాయకులు శ్రీనివాస్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం టెంకంపేట గ్రామంలో చిన్నారులు అనూష నాగచైతన్యలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మైసని గోపాల్, ఇటీవల మైసని నాగమణి ఇద్దరు మృతి చెందడంతో వారి పిల్లలు ఇద్దరు తల్లిదండ్రులు లేని అనాధలయ్యారు. ఇంట్లో ఎవరో ఒకరు మృతి చెందితేనే ఎంతో లోటు ఉంటుందని, అలాంటిది తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో ఆ పిల్లల పరిస్థితి ఎంతో విషాదకరంగా ఉంటుందన్నారు. అలాంటి పరిస్థితులలో సమాజం వారి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీరి కుటుంబానికి ఎలాంటి ఆస్తులు లేవు. వారు నివసించడానికి చిన్న గుడారంలో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం వీరిని ఆదుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, పిల్లలు ఇద్దరిని కూడా ప్రభుత్వమే ఉచితంగా చదివించాలన్నారు. ఇంకా మానవతావాదులు వీరి కుటుంబానికి అండగా నిలవాలన్నారు.

## మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

**దౌల్తాబాద్, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

మహిళా మిస్సింగ్ కేసును దౌల్తాబాద్ పోలీసులు రెండు రోజుల్లో ఛేదించారు. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల నాగరాణి వారం క్రితం రోజు మాదిరిగానే కూలి పని నిమిత్తం గజ్వేల్ కు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికిన వారం రోజులుగా లభించకపోవడంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో భర్త ఫిర్యాదు చేశాడు. మహిళా మిస్సింగ్ కేసును ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ ఆధ్వర్యంలో రెండు రోజుల్లో మహిళా ఆచూకీ తెలుసుకొని సదరు మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు పోలీసులు.



# హరీశ్‌రావు పాదయాత్రను విజయవంతం చేయండి

## మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**చిన్న శంకరంపేట, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చడంలో పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కనీసం రైతులకు ఏ పథకం కూడా అందించలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి విమర్శించారు, మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి హాజరయ్యారు రైతన్న సమస్యలపై ఈనెల 19వ తేదీన ఏడుపాయల నుండి మెదక్ జిల్లా కేంద్రం వరకు నిర్వహించే పాదయాత్ర విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు రైతుబంధు రైతు బీమా వంటి పథకాలు ప్రవేశపెట్టి రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి సకాలంలో వారికి డబ్బులు వేయడం జరిగిందని ఆమె తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు, 60 సంవత్సరాల కాంగ్రెస్ తెలుగుదేశం పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువులు మంచిగ చేయించి పంటలు పండే విధంగా చేసి రైతులు అప్పుల పాలు కాకుండా రైతుల కోసం అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్ ది అని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, నార్సింగ్ మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు సుజాత, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ సర్పంచులు కుమార్ గౌడ్, యాదగిరి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నాయకులు గోండ స్వామి, బాగా రెడ్డి, యాదగిరి, ఏమ చంద్రం, తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి




**దౌల్తాబాద్, నవంబర్ 16 (ప్రజాస్వరం) :**

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పుస్తకాల ద్వారా జ్ఞాన సముపార్జన చేయవచ్చని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్ ప్రధానోపాధ్యాయులు నాగరాజ్ అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా విద్యార్థులకు ఎంతో జ్ఞానం లభిస్తుందని పుస్తక పఠనం అనేది అలవాటు చేసుకుంటే జ్ఞానం పెంచుకోవచ్చు అన్నారు.బాలచెలిమి ఫౌండేషన్ వారు మొత్తం 400 పుస్తకాలను పాఠశాలకు అందివ్వడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రంథాలయంలో పుస్తకాలను చదువుకోవాలన్నారు. రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు సహకరించిన చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మెన్ వేదకుమార్, బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు కైజర్, గరిపల్లి అశోక్ లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

## డీఈవో రాధాకిషన్

**చేగుంట, నవంబర్ 16(ప్రజా స్వరం) :**

క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్రస్థాయి క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులను జాతీయ స్థాయికి పంపించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని మెదక్ జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ డాక్టర్ రాధా కృష్ణ అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను మెదక్ జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ జ్యోతి వెలిగించి ఆరంభించారు, పాల్గొన్న జిల్లా విద్యాధికారికి వివిధ జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు వందన సమర్పణ నిర్వహించారు ఈ క్రీడలలో తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల నుండి 240 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగింది, క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రముఖ సంఘ సేవకుడు అయిత పరంజ్యోతి ఆర్థిక సహాయంతో బహుమతులతో పాటు క్రీడాకారులకు పిఈటిలకు భోజన వసతి కల్పించారు, క్రీడోత్సవాలకు హాజరైన అతిథులకు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రముఖ సంఘ సేవకులు పరంజ్యోతి శాలువా మెమెంటోలతో సన్మానించారు, అనంతరం జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, మండల విద్యాధికారి నీరజ మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి లు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని క్రీడలతో స్నేహ సంబంధాలు పెరగడంతో పాటు వారు తెలిపారు, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను జాతీయస్థాయి పంపించడం జరుగుతుందని క్రీడల్లో గెలుపు ఓటమి సహజం కాబట్టి ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా రేపటి గెలుపుకు ముందుకు పోవాలని వారు పిలుపునిచ్చారు, జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ, మండల విద్యాధికారి నీరజ, ఎస్ జి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామ్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి, తెలంగాణ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ, కర్ణం గణేష్ రవికుమార్, వివిధ జిల్లాల క్రీడోపాధ్యాయులు పాల్గొన్నారు.



## గ్రూప్4లో ముబారస్‌పూర్ వాసి

**దౌల్తాబాద్, నవంబర్ 16 (ప్రజా స్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 4 ఉద్యోగ ఫలితాల్లో ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన నిరుడు విజయ్‌కి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రావడం గ్రామానికి గర్వకారణమని బీఆర్ఎస్ నాయకులు తుప్పతి నరేష్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ గ్రామాలకు చెందిన నీరుడి నరసవ్వ రాములు కుమారుడైన నిరుడు విజయ్ ని సన్మానించి విద్యార్థి నమ్ముకొని ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించాలని పట్టుదలతో విద్యార్థి విజయ్ ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యను ఆకర్షించాడు కుటుంబ పరిస్థితులు ఆర్థికంగా వెనక్కిపోవడంతో 9 పదవ తరగతిని ముబారస్ స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించారు ఇంటర్ మొదటి సంవత్సరం రెండవ సంవత్సరం తెలంగాణ మోడల్ స్కూల్ దౌల్తాబాద్ లో పూర్తి చేయడం జరిగింది బీటెక్ హైదరాబాదులోని పూర్తిచేసి జరిగిందన్నారు. జ్ఞానం, తెలివి ముందు పేదరికం అడ్డు కాదని ప్రతిఒక్కరూ జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టంతో చదివితే విజయం సాధించవచ్చన్నారు. విజయ్ పేద కుటుంబంలో జన్మించినప్పటికీ ఎంతో కష్టపడి చదివి గ్రూప్4 ఉద్యోగుల జాబితాలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించడం ముబారస్ పూర్ గ్రామానికి గర్వకారణంగా ఉందన్నారు. గ్రామ యువత విజయ్ ని ఆదర్శంగా తీసుకుని మరి ఎంతోమంది ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, పంజ రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

